క్లుప్తంగా

పర్ణశాలలో పూజలు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలను అర్చకులు మంగళవారం నిర్వహించారు. స్వామి వారికి వేకువజామున తిరువారాధన స్వామివారికి ఉంజల సేవ నిర్వహించారు. విశేష శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన పూజా కార్యక్రమం నిర్వహించి స్వామి వారికి విశేష ప్రసాదం నివేదన సమర్పించారు. ఈ నెల 28వ తేదీన పర్ణశాల ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అనిల్ కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు మదన్మోహన్ ఆచార్యులు, శివశంకర్ కిరణ్ కుమార్ ఆచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే..

మణుగూరురూరల్: స్పెషల్ సమ్మరి రివిజన్–2025 కార్యక్రమంలో భాగంగా మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు, రెవిన్యూ సిబ్బంది ఓటర్ నమోదుపై మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో 18సంవత్సరాలు నిండిన వారి వివరాలను తెలుసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్ల తొలగింపు, ఓటర్ కార్డులో మార్పులు, చేర్పులు, సవరణలు వంటివి చేసుకోవాలని సూచించారు.

ఆయిల్‌ఫెడ్ ఎండీకి వినతి

అశ్వారావుపేట: తెలంగాణలో కొత్తగా ఆయిల్ పామ్ పెంపకానికి ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన ప్రాంతాల నుంచి లేత గెలలను తీసుకోవద్దని ఆయిల్‌ఫెడ్ ఎండీ, హార్టికల్చరల్ కమిషనర్ యస్మీన్‌భాషాకు తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌ఫామ్ గ్రోవర్స్ సొసైటీ తరుపున వినతిపత్రం సమర్పించారు. మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య ఎండీని కలిసి ప్రైవేటు కంపెనీలు ఫ్యాక్టరీలు నిర్మించనందున లేత గెలలు అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని.. తద్వారా లేత గెలలను ఇక్కడ గానుగ ఆడటం ద్వారా నూనె రికవరీ శాతం తగ్గుతుందని పేర్కొన్నారు. టన్ను గెలలకు రూ.2వేలు ఒక్కో రైతు నష్టపోవాల్సి వస్తుందని.. ప్రైవేటు కంపెనీలు త్వరగా ఫ్యాక్టరీలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని విన్నపంలో పేర్కొన్నారు.

ఆలయానికి భక్తుల తాకిడి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి శ్రావణమాసం చివరి మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించగా భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ వారు అందజేసిన పసుపు, కుంకుమ, జాకెట్‌లను తీసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు 5వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ వితరణ

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు చెందిన లయన్స్‌క్లబ్ సభ్యులు శీమకుర్తి చక్రధరరావు స్థానిక పేటమాలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి వితరణ చేశారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు, కంపాస్ బాక్సులు, పాఠశాల అవసరాలకు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దూబగుంట్ల దుర్గారావు, యూఎస్ ప్రకాశరావు, శీమకుర్తి వెంకటేశ్వరరావు, సుంకవల్లి వీరభద్రరావు, కోటగిరి మోహనరావు, జూపల్లి బ్రహ్మారావు, కంచర్ల రమేష్, వీఎస్ ప్రకాశరావు, కంచర్ల రామారావు, చల్లా రామారావు, కొఠారు చలపతిరావు, ఇనుగంటి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గుండాల: వచ్చే నెల 1, 2వ తేదల్లో హైదరాబాద్‌లో జరుగే ప్రగతిశీల మహిళా సంఘం 7వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకురాలు యనగంటి స్వరూప పిలుపునిచ్చారు. మండలంలోని కాచనపల్లిలో మంగళవారం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా, సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో స్త్రీ పురుష సమానత్వం కోసం శ్రామిక వర్గ మహిళల విముక్తి కోసం పీవోడబ్ల్యూ పనిచేస్తుందని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, స్త్రీ, పురుషుల సమానత్వం పోరాడుతూనే నవ సమాజం స్థాపన కోసం ఉద్యమించాలని తెలిపారు. మహాసభలకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కనకమ్మ, సావిత్రి, సుజాత, కాంతి, బీబీ, రాణి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కావలెను..!

- ఏఈఈ, డీఈఈ పోస్టులు ఖాళీ
- ఆర్‌అండ్‌బీలో గ్యాంగ్‌మెన్‌లే ఇంజనీర్లు..
- నాసిరకం ఇసుకతో నిర్మాణాలు



ఇసుకగా వాడుతున్న నాణ్యత లేని దుబ్బమట్టి



అశ్వారావుపేటలో డివైడర్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న గ్యాంగ్‌మెన్‌లు

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ శాఖకు అధికారులే కరువయ్యారు. ఏఈఈగా ఉన్న శ్రీనివాసరావు బదిలీ అయిన తర్వాత ఆ పోస్టులోకి ఎవరూ రాలేదు. ఇన్‌ఛార్జ్‌గా గణేష్ అనే ఏఈఈకి బాధ్యతలు అప్పటించినా.. ఎంబీ రికార్డులకే పరిమితం. అప్పటినుంచి జేటీఓగా ఉన్న శెట్టిపల్లి కృష్ణార్జునరావు ఏఈఈ పనులన్నీ నిర్వహించేవారు. ఆయన గతనెల పదవీ విరమణ పొందారు. దీనికి తోడు డీఈఈ శ్రీనివాస్ ఇక్కడనుంచి బదిలీ అయ్యారు. నియోజకవర్గానికి డీఈఈ లేకపోవడం.. ఏఈఈ పోస్టు ఖాళీగా ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది. గతంలో సెంటర్ లైటింగ్ పనులు చేయాల్సిన కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేయకపోవడంతో ప్రభుత్వం మారాక కొందరు ఆపనులను మొదలు పెట్టారు. దీనికి తోడు సైడ్ డ్రెయినేజీ పనులు కూడా మొదలయ్యాయి. కానీ పర్యవేక్షించేందుకు అధికారులు లేరు. గ్యాంగ్‌మెన్‌లే ఏఈఈ, డీఈఈలుగా వ్యవహరిస్తూ దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కట్టుబడి దశలోనే డివైడర్ కుప్పకూలింది. అయినా.. చావుతప్పి కన్ను లొట్టపోయినట్లు పనులు ముందుకు నెట్టుకుపోతున్నారు. నాణ్యతా ప్రమాణాలు సరే.. రెండేళ్ల క్రితం జాతీయ రహదారిపై తవ్విన కాలువల్లో డివైడర్ నిర్మాణం పూర్తయితే చాలు అన్నట్లు స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం–రాజమండ్రి రహదారికి ఇరువైపులా నివసించే వారు నిత్యం దుమ్ముతో నానా అవస్థలు పడుతున్నారు. రహదారిపై గుంతలు పూడ్చక.. పూడ్చినా నామమాత్రంగా బూడిదతో నింపడంతో కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది.

దుబ్బమట్టే ఇసుక..

ఏదో రకంగా డివైడర్ పూర్తయితే చాలు అనుకుంటుంటే.. నాణ్యత లేని ఇసుక వాడుతున్నారు. గోదావరి నుంచి లేదా అనుమతించిన ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టాలి. ఇటీవల వచ్చిన వరదలకు పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగింది. ఈ క్రమంలో నారాయణపురం తదితర గ్రామాల్లో ఇసుక మేటలు వేశాయి. మేటలను పరిశీలించిన మైనింగ్ అధికారులు ఈ ఇసుక నిర్మాణాలకు పనికిరాదని.. మట్టి శాతం అధికంగా ఉందని నిర్ధారించారు. కానీ అశ్వారావుపేటకు ఇసుక వ్యాపారులు నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇదే ఇసుకను జాతీయ రహదారిపై డివైడర్ నిర్మాణానికి వాడుతున్నారు. అందుకే నిర్మాణక్రమంలో కొన్ని చోట్ల కూలిపోతోంది. ఈ ఇసుక నాణ్యతను తిరస్కరించేందుకు గ్యాంగ్‌మెన్‌లు సాహసం చేయలేకపోతున్నారు. కాంక్రీట్‌ను మిల్లర్ లేకుండా పారలతో కుండీ కట్టి కలిపేస్తున్నారు. వీరు చేసిందే పని.. పాటించిందే నాణ్యతలా ఉంది వ్యవహారం. నిర్మాణంలో చేపట్టాల్సిన మెళుకువలు, నిబంధనలు గ్యాంగ్‌మెన్‌లకు తెలియక.. మేస్త్రీలు కట్టిందే డ్రెయిన్‌గా కొనసాగుతున్నాయి పనులు. పనులు నాణ్యంగా చేయడంతో పాటు దుమ్ము కారణంగా కాలుష్యం వ్యాపిస్తోంది. దీన్ని నివారించి పనులను వేగవంతంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈవిషయమై ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావును సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

ఉపాధిహామీ కూలీలకు న్యాయం చేయాలి



చర్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

చర్ల: మండలంలోని గొంపల్లి గ్రామానిక ఇచెందిన ఉపాదిహామీ కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం చర్లలో నిరసన తెలియజేశారు. చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధిహామీ కూలీలను నిరసన చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్ మాట్లాడుతూ.. గొంపల్లిలో జరిగిన ఉపాదిమామీ పనులలో జరిగిన అవకతవకలపై అధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. పనులు చేసిన కూలీలలకు చెల్లింపులు చేయకుండా పని చేయని వారికి మస్టర్లు వేసి వారికి చెల్లింపులు చేశారని, ఈ విషయమై గతంలోనూ ఆందోళన నిర్వహించామని తెలిపారు. చర్యలు చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ అధికారులు మళ్లీ ఆ వ్యవహారంపై మాట్లాడడం లేదని ఆయన అన్నారు. తక్షణమే పనులు చేసిన ఉపాధిహామీ కూలీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు నాగమణి, పున్నారావు, సూరమ్మ, మంగవేణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో కొమరం భీమ్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థలం కేటాయింపు కోసం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ అశోక్‌కుమార్ స్థల పరిశీలనకు ఆర్ఐ, సర్వేయర్‌ను ఘటన స్థలానికి పంపారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఆదివాసీ పోరాట యోధుడు, నైజాం సర్కారుపై జల్,జంగిల్, జమీన్ సాధన కోసం పోరాటం చేసి అసువులు బాసిన వీరుడు కొమరం భీమ్ జయంతి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మాజీ జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు సోయం కామరాజు, కుంజా శ్రీనివాసరావు, కణితి రాముడు, ముర్రం వీరభద్రం, కారం పుల్లయ్య,వర్శ ముద్దరాజు, తునికి కామేశరావు, సొందే మల్లురు తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపు డిమాండ్‌తో 'చలో హైదరాబాద్'

గుండాల: కస్తూర్బా ఏకలవ్య మోడల్ స్కూల్ వర్కర్లకు బేసిక్ పే అమలు చేయాలని, జీతాల పెంచి రిటైర్డ్ అయిన వారికి రూ. 5 లక్షల చెల్లించాలని ఐఎఫ్‌టీయూ మండల నాయకులుడుకొమరం శాంతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆయా సమస్యలపై ఈ నెల 30న జరుగు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ కేజీబీవీ లలో సుమారు 7వేలకు పైగా నాన్ టీచింగ్ వర్కర్లు పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇతర గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బందికి చెల్లిస్తున్న మాదిరిగా కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి సిబ్బందికి బేసిక్ పే తో పాటు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించాలని, ఖాళీ అయిన స్థానాల్లో సిబ్బందిని వెంటనే నియమించాలని అన్నారు. ఆయా డిమాండ్ల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు.

రుణమాఫీలో ఆంక్షలు వద్దు



గుండాల: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గుండాల: మండలంలో పంట రుణమాఫీ కాని రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షలు మాఫీ చేయాలని మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే రేషన్ కార్డుపై నలుగురు కుటుంబ సభ్యులు రుణాలు తీసుకుంటే ఒకే కార్డుపై రూ.రెండు లక్షలు మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రకటించడం శోషనీయమన్నారు. పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫి చేయాలని, లేని యెడల రైతులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ నాయకులు యాసారపు వెంకన్న, పర్శిక రవి, పెండెకట్ల పెంటన్న, అరెం నరేష్, బచ్చల సారయ్య, గడ్డం లాలయ్య, బానోత్ లాలు, మల్యాల మల్లేష్, బుచ్చయ్య, తాటి రమేష్, ఈసం కృష్ణ, పోతయ్య, రామారావు, సుధాకర్, నర్సన్న పాల్గొన్నారు.

ములకలపల్లి: ఎటువంటి కొర్రీలు పెట్టకుండా బేషరతుగా రుణామాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్‌కె.ఉమర్, జిల్లా సహాయ కార్యదర్శి కుంజా కృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలకేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆదినారాయణ, వంకా సురేశ్. వెంకటేశ్వర్లు, మారుతి రాఘవులు, ముదిగొండ మల్లయ్య, నాగరాజు, లక్ష్మి, నర్సక్క, విజయమ్మ, లలిత, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాఫీ నుంచి తప్పించుకునేందుకే..

బూర్గంపాడు: రుణమాఫీ అమలు చేయకుండా తప్పించుకునేందుకు ప్రభుత్వం, అధికారులు కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ ఆరోపించారు. మంగళవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులకు రుణమాఫీ చేయటం లేదని, రేషన్‌కార్డు లేని రైతులకు కూడా రుణమాఫీ చేయటం లేదన్నారు. పహాణీలపై బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు ఇప్పుడు పాసు పుస్తకాలు లేవనే కారణంతో రుణమాఫీ చేయకపోవటం దారుణమన్నారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఇప్పుడు రుణమాఫీకి రేషన్‌కార్డులు లింక్ పెట్టడం ప్రభుత్వ దాటవేత వైఖరికి నిదర్శనమన్నారు. రుణమాఫీ అమలు చేయకుంటే రైతులతో కలసి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

నేటి నుంచి రేషన్‌కార్డు లేని కుటుంబాల నిర్ధారణ

అన్నపురెడ్డిపల్లి: రేషన్ కార్డు లేక పంట రుణమాఫీ కానీ రైతు కుటుంబాలను బుధవారం నుంచి నిర్ధారణ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారిణి అనూష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీల వారిగా సభలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 28న అన్నపురెడ్డిపల్లి రైతు వేదిక వద్ద, 29న మర్రిగూడెం, 30న అబ్బుగూడెం, 31న పెంట్లం, 2వ తారీకు పెద్దిరెడ్డిగూడెం, గుంపెన, 3వ తారీకు ఊటుపల్లి, 4న నర్సాపురం పంచాయతీ కార్యాలయాలలో సభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు కుటుంబ సభ్యులతో పాటు తమ ఆధార్‌కార్డులను తీసుకురావాలని తెలిపారు.

జోనల్‌స్థాయి క్రీడలు

బూర్గంపాడు: పాల్వంచ జోనల్ స్థాయి క్రీడలు సెప్టెంబర్ 19,20వ తేదీలలో బూర్గంపాడులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ప్రధానోపాధ్యాయురాలు రవీల తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో మండలస్థాయి క్రీడలు జరుగుతాయని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 19, 20 తేదీల్లో పాల్వంచ జోనల్‌స్థాయి (పాల్వంచ, బూర్గంపాడు, ముల్కలపల్లి మండలాలు) క్రీడలు జరుగుతాయని తెలిపారు. వివరాల కోసం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్ (9032324982)ను సంప్రదించాలని కోరారు.

సంస్కృతిని మరువొద్దు

ములకలపల్లి: హిందూ సంస్కృతి, సాంప్రదాయలను మరువద్దని వనవాసీ కల్యాణ పరిషత్ అఖిల భారత సంఘటన కార్యదర్శి అతుల్ జోన్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన సమ్మక్క పూజారులు, శివసత్తుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. భారతీయ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. శివాలయ అర్చకులు విస్సావజ్జుల సురేశ్‌శర్మ, పద్దం బుజ్జి, బిక్కుమళ్ల వేణుగోపాల్, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణ రాజు, పువ్వాల శ్రీను, గొడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

గుండాల: అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఆళ్ళపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మర్కోడు గ్రామానికి చెందిన చామకూరి అంజయ్య ఉపేంద్ర దంపతుల కుమారుడు సాగర్ (26) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స అందిస్తున్నప్పటికీ మంగళవారం సాగర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె..

అశ్వారావుపేట: విద్యుత్‌షాక్‌కు గురయిన పాడిగేదె మృతిచెందిన సంఘటన సోమవారం గంగారం గ్రామంలో చోటుచేసుకుంది. గేదె యజమాని కాసుమాల శేఖర్‌రావు మంగళవారం అశ్వారావుపేట పోలీసులకు సమర్పించిన ఫిర్యాదు ప్రకారం.. శేఖర్‌రావుకు చెందిన పాడిగేదెలను మేతకు కాపరులు తీసుకువెళ్లగా గంగారం గ్రామానికి చెందిన పెండ్యాల సత్యనారాయణకు చెందిన పామాయిల్ తోట విద్యుత్ కనెక్షన్ తీగ కిందకు వేలాడుతూ ఉండి పాడిగేదెకు తగిలింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.90వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోడు భూముల వివరాలివ్వండి



అటవీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఫారెస్ట్ భూమి వివరాలు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అటవి అధికారులను కోరారు. మంగళవారం అటవీ అధికారులతో ప్రజాభవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే.. తాజాగా స్వాధీనం చేసుకుంటున్న పోడు భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరుపేదల భూములను ఒకటికి రెండుసార్లు పరిశీలించి అటవీ భూమి అని నిర్ధారణ అయిన అనంతరమే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఇల్లు నిర్మించిన భూముల జోలికి వెళ్లి కుటుంబాలు రోడ్డున పడేలా చేయొద్దని అటవీ భూములు ఆక్రమణలు కాకుండా ఫారెస్ట్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, పోడుభూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అశ్వాపురంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ చేస్తున్న భూముల వివరాలు అడిగారు. కార్యక్రమంలో అటవీ అధికారులు మక్బూల్, ఉపేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



గుండాల: వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ కులాలకు 2014 స్థానిక ఎన్నికల రిజర్వేషన్ ఆధారంగా 2024 ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు బొమ్మెర శ్రీనివాస డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలవారికి రాజ్యాంగపరమైన హక్కులు, విద్యా ఉపాధి, ఉద్యోగ, రాజకీయ పరంగా రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ కృపాకర్, సలికంటి కొమరయ్య, బొమ్మెర సత్యం, దుర్గం లక్ష్మీనారాయణ, శివ శంకర్, జనగం లాలయ్య, బొమ్మెర నాగేశ్వరావు, కీసర సాగర్, రమేష్ పాల్గొన్నారు.

రజకులకు..

మణుగూరురూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు రిజర్వేషన్ కల్పించాలని రజక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదిగొండ రాంబాబు, చిటికెన ముసలయ్యలు డిమాండ్ చేశారు. మండలంలోని చాకలి ఐలమ్మనగర్‌లో రజక వృత్తిదారుల సంఘం జనరల్‌బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మణుగూరు ప్రాంతంలో రజకులు నేటికి ఉద్యోగ, ఉపాధి, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడే ఉన్నారన్నారు. మణుగూరులో మెకనైజ్డ్ లాండ్రీ పరిశ్రమను నెలకొల్పాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగి నిధులు మంజూరైనా రజక కమ్యూనిటిహాల్, మోడల్ దోభీ ఘాట్ పనులను వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాపర్తి శ్రీహరి, రాపర్తి నరహరి, కొమరగిరి రమేష్, గుంటుపల్లి నరసింహారావు, కుమ్మరికుంట్ల నరేష్, వీరభద్రం, జానీ, సైదులు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌బండ్ పనులు పూర్తి చేయాలి



సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. మంగళవారం గుమ్మడవల్లి ప్రాజెక్టు రింగ్‌బండ్ పనులను ఆయన పరిశీలించారు. జూలై 18న కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని.. పనులు వేగంగా పూర్తి చేసి రైతాంగానికి సీళ్లందించాలని సూచించారు.

మంగళ గౌరీ వ్రతం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ రోడ్డులోని శివాలయంలో మంగళ గౌరీ వ్రత వేడుకను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన మంగళ గౌరీ వ్రతంలో ఐటీడీఏ పీఓ సతీమణి మనీషా పాల్గొని వ్రతంలో పాల్గొన్న మహిళలకు తాంబూలం అందజేశారు.

ఎల్‌ఈడీ టీవీలు మంజూరు

చర్ల: మండలంలో ఉన్న 112 అంగ్‌వాడీ కేంద్రాలకు గానూ 91 అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌ఈడీ టీవీలు మంజూరైనట్లు మహిళా శిశు సంక్షేమశాఖ సీడీపీఓ చైతన్య తెలిపారు. ఎల్‌ఈడీ టీవీలతో పాటు క్రీడా సామాగ్రి, స్టేషనరీ కూడా మంజూరు కాగా వాటిని మంగళవారం ఆయా కేంద్రాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల అభివృద్ధి నిధులతో గతంలో జిల్లాలో పని చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక చొరవతో ఇవి మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఆయా కేంద్రాలకు మంజూరైన ఎల్‌ఈడీ టీవీలు, క్రీడా సామగ్రి, ఫర్నిచర్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 29 శాఖలలోని ఉన్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను లబాడాలకు కాకుండా స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర అన్నారు. ఐటీడీఏ అవరణంలో మంగళవారం ఏర్పాటు అయిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించాలని, ఏజెన్సీలో హైడ్రా చట్టాన్ని అమలు చేయాలని కోరారు. 2018లో ట్రైకర్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సబ్సిడీలను విడుదల చేయాలన్నారు. నాయకులు కారం గోపాల్ రావు, కూరం బొర్రయ్య, కారం సూరి, కాక రాంబాబు, కాక శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ సిబ్బంది నిరసన

దుమ్ముగూడెం: ఉన్నతాధికారులకు తప్పుడు విచారణ నివేదికలు సమర్పించి క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్న సెర్ప్ డీపీఎంపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం సెర్ప్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెర్ప్ కార్యాలయంలో పని చేస్తున్న డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) రంగారావు అశ్వాపురం మండలంలో ఎంఏసీఎస్ యాక్టు 1995 బైలా విరుద్ధంగా జరిగిన ఘటనపై విచారణ చేసి తప్పుడు నివేదికను సెర్ప్ సీఈఓ, హైదరాబాద్ వారికి సమర్పించాడని ఆరోపించారు. రంగారావుపై చర్యలు తీసుకోవాల్సిందిగా డీఆర్‌డీఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సీసీలు నర్సింహారావు,కృష్ణ పాల్గొన్నారు.

అశ్వాపురం: సెర్ప్ జిల్లా స్థాయి అధికారి ఉన్నతాధికారులకు తప్పుడు విచారణ నివేదికలు ఇస్తూ క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్న సెర్ప్ డీపీఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సెర్ప్ సిబ్బంది నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాధారెడ్డి, కళావతి, శోభారాణి, తులసి, రాంబాబు, వెంకటలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహం

భద్రాచలంటౌన్: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతికి పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని భద్రాచలం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం టి.రమ ఆధ్వర్యంలో విద్యార్థులు సుమారు 100 మట్టి విగ్రహాలను తయారు చేసే పనికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన ఉండి దానిని ఎలా కాపాడాలనేది తెలిపేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టిన్నట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వాడకుండా మట్టి విగ్రహాలకు పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆమె కోరారు. పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.